



శ్రీధర్‌కి మెలకువ వచ్చింది.

డ్రాయరు మీది అలారం కేసి చూశాడు. అది ఎప్పుడో రెండున్నరకే ఆగిపోయినట్లుంది. కిటికీ రెక్క కొద్దిగా తీశాడు. వేకువ మేలి ముసుగులో వున్న నాట్య సుందరిలా వుంది. కిటికీ మూసి వేశాడు. శ్రీధర్‌కి నిద్రపట్టలేదు- అటుఇటు ఎంత దొర్లినా, విసుక్కున్నాడు.

శ్రీధర్ విసుగుదలకి కారణముంది. ఆ రోజు సెలవు. తొమ్మిది గంటలదాకా నిద్రపోదామనుకున్నాడు. అదే ఆఫీసున్న రోజయితే ఇంచక్కా తొమ్మిదిన్నరకి మెలకువ వస్తుంది. అర

గంటలో అన్నీ తెముల్చుకోలేక నానా అవస్థానూ.

శ్రీధర్ మరికాస్సేపు ప్రయత్నించి ట్రాన్సిస్టర్ ఆన్ చేశాడు ఇక నిద్రపట్టదని. భక్తిరంజని వస్తోంది. రాత్రి ఆపుచేసిన కథని రాద్దామని టేబిల్ ముందు కూర్చున్నాడు. తలుపు దడదడలాడింది.

పనిమనిషి.

"రోజూ ఎన్ని కేకలువేసినా లెగిసేవారు కారు. ఏటి బాబూ, యిచిత్రం! ఓ కేకకే లెగిసి వచ్చినారు?" పనిమనిషి నవ్వుతూ అడిగేసింది.

శ్రీధర్ ఫ్లాస్క్ ఇచ్చి "ముందిక కాఫీ పట్రా" అని పురమాయించాడు.

శ్రీధర్ కాఫీ త్రాగి వరండాలో దినపత్రిక తిరగేస్తూండగా శివ పరుగెత్తుకుని వచ్చాడు. వాడికి పదేళ్ళుంటాయి. ముఖమంతా అమాయకత్వమే.

"ఏమోయ్, షేక్స్‌పియర్! ఇలా వచ్చావ్?"

శివ వగరుస్తూ పిట్ట గోడమీద కూర్చున్నాడు. "మిమ్మల్ని రమ్మంది అక్కయ్య. వెంటనే తొందరగా ఆలస్యంగా లేకుండా."

"ఏమిటి పని?"

"నాకు తెలియదు."

"నీకు తెలియనివి వుంటాయంటే నాకు నమ్మబుద్ధి కాదు."

శివ ముఖంలో గర్వం.

"వద్దు బాబూ....అక్కయ్య చెప్పవద్దంది."

శ్రీధర్ అల్మారాలోని చాక్‌లెట్ డబ్బా తెచ్చి రెండిచ్చాడు. "నువ్వు చెప్పావని మళ్ళీ చెప్తానా నేను?"

"భూదేవంత ఒట్టు. సత్తె ప్రమాణంగా చెప్పకూడదు."

శ్రీధర్ ఒట్టువేశాడు.

"ఇవాళ మా అక్కయ్య పుట్టిన రోజు." శివ చెప్పి పరుగు తీశాడు.

శ్రీధర్ నవ్వుకున్నాడు. పద్మ రూపం గుర్తువచ్చి మనసు పరవశమైంది. వర్షాకాలం రాత్రి వెన్నెలలోని చెరువులా అంతరంగం మెరిసిపోయింది.

శ్రీధర్ తయారయ్యేసరికి తొమ్మిదయింది. పనిమనిషి తెచ్చిన టిఫిన్ తింటూండగా దూరపు చుట్టం దిగుమతయ్యాడు. పెళ్ళికని మరో చోటికి వచ్చాడట. శ్రీధర్‌ని చూడ్డానికి వచ్చాడు. ఫలహారం, కాఫీ పుచ్చుకుని ఉత్సాహంగా కబుర్లు చెప్పసాగాడు.

శ్రీధర్ వెళ్ళడానికి తొందర పడుతున్నాడు.

చుట్టం కోర్టు పక్షి. దావాల గురించి గుక్క తిప్పకుండా చెపు

తున్నాడు ఎంతోయిదిగా.

"ఏముంది బాబూ!" శ్రీధర్ గోల పెట్టాడు.

"పనిలేని దెవరికి రా? అందరికీ పని వుంటుంది. ఇప్పుడు మనకి పని లేదంటావా? నాను చెప్పడం పని. నీకు వినడం పని."

ఆ శాల్తీని కదిపి పంపే సరికి పదిన్నరయింది.

"ఆలస్యమైపోయింది. పద్మకి కోపం వచ్చేసి వుంటుంది." శ్రీధర్ కంగారుగా తాళం కోసం తిరగేశాడు గదంతా.

బయట కారు ఆగింది. పద్మ మెట్లు ఎక్కుతోంది.

"మీరు వచ్చేశారా?" తమకంగా అడిగాడు.

"కొండ మన దగ్గరకి రాకపోతే మనం కొండ దగ్గరకే పోవాలి."

"చూశారా ఎలా పొడిచారో... కూర్చోండి. పార్టీకి ఇంకా వ్యవధి వుందా? పుట్టినరోజు శుభాకాంక్షలు అందుకోండి."

"పుట్టిన రోజేమిటి?"

"శివా చెప్పాడు."

"మీ పరిచయం వల్ల మావాడికీ కవిత్వం వచ్చేస్తోంది. సెలవు రోజే కదా! మీరున్నారో లేదో చూసి రమ్మన్నాను. ఉంటే రమ్మని చెప్పరా అన్నాను."

శ్రీధర్ ఆమె ఎదురుగా మంచం మీద కూర్చున్నాడు నవ్వుతూ.

"మా కోర్టు పక్షి రాకపోతే బహుమతి కూడా కొనేసేవాణ్ణి."

"కవిగారి బహుమతి ఏమిటో?"

"మద్రాసు అప్పడాల ప్యాకెట్."

"ఛీ...."

"నేను అలాంటి బహుమతులే పట్టుకు వెళతాను. మొన్న మా ఫ్రెండ్ పెళ్ళయింది. రెండు కిలోల వంకాయలు చదివించాను. ఖరీదైన బహుమతులు నలుగురూ ఇస్తారు. ఇలాంటివిస్తే మనం చాలాకాలం గుర్తుంటాం. తర్వాత మా ఫ్రెండ్ చాలా సంతోషించాడు. కూరకి వంకాయలు తక్కువయ్యాయిట. మళ్ళీ నీ ధర్మమాని బజారుకి పోలేదన్నాడు."

పద్మ విరగబడి నవ్వింది. ఎక్కువ నవ్వడంవల్ల ఎక్కిళ్ళు కూడా వచ్చాయి. శ్రీధర్ ఇచ్చిన మంచినీళ్ళు త్రాగుతూ, "మీ దగ్గరకి రావాలంటే అందుకే భయం. జోకులు పేలుస్తారు ఆటంబాంబుల్లా" అన్నది.

"ఆ జోకుల కోసమేగదా మీరు వచ్చేది."

పద్మ లేచింది వాచీ చూసు

కుంటూ, "నడవండి ఇప్పటికే ఆలస్యమైంది. షో టైం అయింది."

"మార్నింగ్ షోకా?"

"రారా ఏమిటి? ఏమైనా కావ్యం రాస్తున్నారా?"

"బాగుంది. కోమటిపద్దా అస్తమానం రాయడానికి. నడవండి."

శ్రీధర్ ఎక్కాగానే స్టార్టు చేసింది పద్మ.

సినిమా వదిలేసరికి ఒంటి గంటన్నరయింది. "హోటల్ ముందదించి పుణ్యంకట్టుకోండి."

కారు తమ బంగళా ముందు ఆపింది.

"హోటలంటే మీ ఇంటికి తెచ్చారేమిటి?" దిగుతూ అడిగేడు.

"ఇదే ఈరోజు మీ హోటల్. నడవండి - కంపెనీ లేకపోతే భోం చెయ్యలేను. నాన్నగారు కూడ వూళ్ళో లేరు." పద్మ లోపలికి దారి తీసింది.

బాత్‌రూంలో సోప్ వాష్ చేసుకొని శ్రీధర్ డైనింగ్ టేబిల్ ముందు కూర్చున్నాడు. వంట మనిషిని పొమ్మని చెప్పి తానే సర్వ్ చెయ్య సాగింది పద్మ.

"శివా రాడేం భోజనానికి?" కలుపుకుంటూ అడిగాడు.

"తిరిని, సంచారానికి వెళ్ళాడు."

శ్రీధర్ భోజనమయ్యాక వరండాలో సిగరెట్ కాలుస్తూ నించున్నాడు. పద్మ వక్కపొడి ఇస్తూ "ఈ ఎండలో వెళ్ళిపోతారా ఏమిటి?" అన్నది.

"మంచి భోజనం పెట్టారు. మంచి నిద్రవస్తుంది."

"ఆ పని ఇక్కడే చెయ్యండి."

"మీకు శ్రమ." నవ్వాడు.

"శ్రమ నాక్కాదు. మంచానికి." నవ్వేస్తూ గెస్టురూం చూపింది.

సాయంత్రం ఆరు గంటలైంది. పద్మ గెస్టురూంలోని సోఫాలో అరగంటనుంచి శ్రీధర్ లేస్తాడేమోనని ఎదురుచూస్తోంది. టీ సమయం దాటిపోతూండటంవల్ల తల దిమ్మగావుంది. సోఫాలోని మ్యాగ్జైన్ తీసి కాలక్షేపంగా తిరగేయ సాగింది.

పద్మకి కథలు, నవలలు అంటే ఇష్టం. రెండేళ్ళ క్రిందట ఒక కథల పోటీలో రచయితల పరిచయాల్లో శ్రీధర్ ఫోటో చూపింది. అదే వూరని తెలిసి స్వయంగా వెళ్ళింది.

రెండు మూడుసార్లు తిరిగితే కాని అతడు దొరకలేదు.

"మీకు శ్రమ ఇచ్చినందుకు చింతిస్తున్నాను. పాత ఉద్యోగం పోయి పది రోజులయింది. కొత్త ఉద్యోగం కోసం వేటాడు

తున్నాను" అన్నాడు శ్రీధర్.

శ్రీధర్‌కి ఎవరూ లేరు. నలు గురి సాయంవల్ల బియ్యే పూర్తి చేశాడు. ఉద్యోగం మంచిది దొర కడంలేదు.

"ఆ భారం నాకు వదిలె య్యండి" అంది పద్మ పరిచయ మయ్యాక.

పాణిచంద్ర బిజినెస్ మాగ్నెట్. వ్యాపారాలూ, లాభాలూ ఆయన జీవితచక్రాన్ని తిప్పుతున్నాయి. ఆయన పద్మ తండ్రి.

"అలాగేనమ్మా!"

డబ్బున్న నాన్నలందరి లాగానే ఆయనకి కూతురంటే గారాబం. భార్యపోయినా తిరిగి పెళ్ళి చేసుకో లేదు.

శ్రీధర్‌కి ఫ్యాక్టరీలో ఉద్యోగం దొరికింది.

"థాంక్యూ! మీ ఋణం...." కృతజ్ఞతగా అన్నాడు.

"మంచి కథలు రాసి తీర్చు కోండి."

ఇద్దరి పరిచయం రోజురోజుకీ పెరుగుతోంది. రెండు యువ హృదయాల్లో పెరిగే రసభావ శబ లతే.... ప్రేమ.

ఆ ప్రేమకి ముందడుగు పెళ్ళి. ఆ ప్రేమ పూలకి మాల పెళ్ళి. ఆ ప్రేమని విత్తుకునే మాగాణం పెళ్ళి.

"మా డాడీని అడుగుతాను" అంది పద్మ.

అలా అని రెండు నెలలుపైగా అయింది. పద్మ అడగలేక పోయింది. పాణిచంద్ర దగ్గర ఆమెకి ఎంత చనువున్నదో అంత భయమూ వున్నది.

పాణిచంద్రకి దరిద్రులంటే రోత. అంతస్థులేని వారితో మాట్లా డటానికి కూడా చిరాకే. పద్మకి గొప్ప సంబంధం చెయ్యాలి. సంబంధాలు చూస్తున్నాడు. యిది పద్మకి తెలుసు. అడిగి కాదనిపించు కోవడం ఆమెకి యిష్టముండదు.

స్వతంత్రించి ప్రేమాయణం తండ్రితో చెప్పలేదామె!

శ్రీధర్ టీ త్రాగుతూ అడిగాడు. "ఏమన్నారు మీ డాడీ?"

"ఏమనలేదు."

"అదేం?"

"నేను చెప్పలేదు కాబట్టి."

శ్రీధర్ నవ్వాడు. "ఎన్నాళ్ళు మన మధ్య దూరం?"

పద్మ అతడి ప్రక్కగా జరి గింది. "దూరమేముంది?"

శ్రీధర్‌కి ఆమె మెత్తటి స్పర్శ తగిలిగగుర్పు కలిగింది. ఆ తీయని భావంలో మరేంమాట్లాడలేకపోయా

"వనం తొందరపడితే ఎలా? ఆ రోజు రావాలిగా!"

"టేక్ యువర్ ఓన్ టైం."

శివా లోపలికి వస్తున్న ధ్వని విని పద్మ ప్రక్కకి జరిగింది. "ఇంకాలస్యముండదులే...ఇవాళో రేపో..."

"అదృష్టం."

* * *

పద్మ చదవడం ఆపుచేసి "ఎలా వుంది నాన్నా?" అనడిగింది.

"తలపోటు ఎక్కువయిందమ్మా! నాయర్‌ని కాస్త టీ పంపమను."

పాణీచంద్ర ఈజీఛైర్‌లో వెనక్కి వ్రాలాడు. సాయంత్రం గార్డన్‌లో చల్లటిగాలి వీస్తోంది. పక్షులు కిలకిలమంటూ ఎగిరి పోతున్నాయి.

పద్మ టీపాట్ తెచ్చి కలప సాగింది. "ఎంచేత బాగాలేదు నాన్నా?"

పాణిచంద్ర యింటి దగ్గర వుండటం చాలా అరుదు. జలుబుగా వుండటంచేత ఆ రోజు ఎక్కడికీ కదలలేదు. సమయం చూసి పద్మ 'సీలిమ'లో పడిన కథ చదివి వివిపించింది. దాన్నే ఆమె చదవటానికి కారణముంది.

కథానాయకుడు పేదవాడు. అతడ్ని ధనవంతుడి కూతురు ప్రేమిస్తుంది. ఆమె అన్నగారు పెళ్ళికి అంగీకరించడు. ప్రేమ ఎక్కువై, ధనం కాదని అతడితో పారిపోతుంది. పెళ్ళిచేసుకుంటారు.

"అసలు కథ ముందరుందమ్మా! ప్రేమా దోమా తిని బ్రతకలేరుగదా! ఆ పిల్లకి తాను చేసిన సాహసం యొక్క ఫలితం ఎదర తెలుస్తుంది. అన్నగారు అన్ని మంచి సంబంధాలు తెచ్చాడు కదా! వాళ్ళలో ఎవర్నయినా చేసుకుంటే ఎంత బాగుంటుంది?"

పద్మ మరి అడగలేదు.

శ్రీధర్ గురించి చెప్పడానికిది ఉపోద్ఘాతం. తండ్రి ధోరణి తెలిసిపోయింది. ఇప్పుడు శ్రీధర్ గురించి ఏం చెబుతుంది?"

పద్మకి బాధవేసింది. అక్కడ కూర్చోలేకపోయింది.

వారం గడిచింది. పద్మ ఏదో సినిమాకు వెళ్ళింది. ఇంటర్వెల్ దాకా చూసి యిక చూడలేక బయటకు వచ్చేసింది. కారు తండ్రికి కావాలని పంపేసింది. రిక్షాలు కూడా కనిపించలేదు. కనిపిస్తే ఎక్కుదామని బయలుదేరింది.

అప్సరా దగ్గర శ్రీధర్ కనిపించాడు.

"మీ గురించి వద్దామా అనుకుంటున్నాను" అన్నాడు పలకరింపుగా.

"మీరు అనుకుంటారు గాని చెయ్యరు కదా? రండి-కాఫీ త్రాగు దాం."

ఇద్దరూ ఏ.సి. గదిలో కూర్చు న్నారు.

"మన ఫ్యాక్టరీలో మేనేజర్ అంబరస్వామిగారు వచ్చేనెల రిట రయిపోతున్నారు. ఫంక్షనుకి గెస్టుగా ప్రిన్సిపాల్‌గార్ని పిలవ మన్నారు మీ నాన్నగారు. ఆయన దగ్గరకి పోయివస్తూంటే మీరు కనిపించారు." శ్రీధర్ కాఫీ త్రాగుతూ చెప్పాడు.

"అయితే మీకు ప్రమోషన్ ఆశ వుందన్నమాట!"

"నేను కాక యింకా అయిదు గురు ఆశపడుతున్నారు."

"డాడీ ఏమంటున్నారు?"

"ఆయన చెయ్యడమే కాని చెప్పడముండదు."

పద్మకి అతడి సమక్షంలో ప్రతిసారిలా వుద్వేగ్నతగాలేదు. తండ్రి పెళ్ళికి సుముఖంగా లేకపో వడం చేదుగావుంది. ఒకవేళ శ్రీధర్ అడిగితే ఏం చెప్పాలి? ఏం చెబితే బాగుంటుంది?

"ఏమిటలా డల్‌గా వున్నారు?"

"మా నాన్నగారు పెళ్ళికి సుము ఖంగా లేరు."

"అడిగారా?" ఆదుర్దాగా అన్నాడు.

"ఇండైరక్టుగా." తను అడిగిన విధం చెప్పింది.

శ్రీధర్ చేదుగా నవ్వాడు. "మనం కాదనిపించుకోడానికి మరో అవకాశం ఉంది."

బేరర్ తెచ్చిన బిల్లు పద్మ అందుకుంది. అంతరంగంలో ఓ మెరుపు మెరిపించింది. "ఇలా చేద్దామా?" అంది ముందుకి వంగి.

"అపుడు మాత్రం..." శ్రీధర్ సందేహంగా అడిగాడు.

"అంతదాకావస్తే పని సులభ మవుతుంది."

శ్రీధర్ అంగీకరించాడు.

"దీని విజయం మీమీదే ఆధార పడివుంది." పద్మ బయటికివస్తూ అంది.

"నేను సారథిని. యుద్ధంచేసే వారు మీరు."

"మీ కవి బుద్ధి పోనిచ్చుకోలేదు. ఎక్కండి-సెంటర్లో డ్రాప్‌చేస్తాను" అంది ఆటో ఎక్కుతూ.

"మీరు వెళ్ళండి. బై."

* * *

పాణిచంద్ర భోజనం చేస్తు న్నారు. వంట మనిషిని వెళ్ళి పొమ్మని తానే వడ్డించసాగింది పద్మ.

"నువ్వు కూడా కూర్చో అమ్మా!"

"నేనూ, శివా తింటాం నాన్న గారూ! మా నేజర్‌గా ఎవర్ని వేస్తారు?"

తినడం ఆపి ముఖంలోకి చూశారు. "ఎవరయినా నిన్నడిగా రామ్మా?"

"లేదు. నేనే అడుగుతున్నాను."

"వేలాయుధం... శ్రీమన్నారాయణ యిద్దరూ కనిపిస్తున్నారు నాకు. ఇంకా ఏం నిర్ణయించుకో లేదు."

"వాళ్ళు చెప్పుల్లో కాళ్ళు పెట్టుకుని వున్నారాయె."

"అంటే?"

"భోం చెయ్యండి. మీకు అంతా చూపిస్తాను."

పాణిచంద్ర భోజనం తొందరగా అయిపోయింది. పక్కాపొడి కూడా నమలాలనిపించింది. పద్మ కోసం వుద్విగ్నంగా చూస్తున్నారు- అశాంతిగా.

పద్మ సూట్‌కేస్‌తో వచ్చింది. మొదట పేపరులోని అడ్వర్‌టైజ్‌మెంటు చూపించి. అది తన కంపెనీలాంటిదే. బెంగుళూరులో వుంది. సూపర్‌వైజర్లు, మేనేజర్లు కావాలని వేసిన ప్రకటన. అనుభవమున్నవారందరినీ ఇంటర్వ్యూకి పిలుస్తామని, అలా పిలిచినవారికి ఫస్టుక్లాసు రైలు టికెట్, భత్యం చెల్లింపబడుతాయన్నారు.

"దీనితో ఏం సంబంధం?" ఆయన పేపరు మడుస్తూ అన్నారు.

పద్మ సుమారు నలభై పోస్టలు కవర్లు బయటికి తీసింది. అన్నీ రిజిస్టర్డు చేసినవే. పాణిచంద్ర ఒక్కటొక్కటి విప్పి చకచకా చూడసాగేరు.

"ఆ కంపెనీవి నీ కెలా వచ్చాయి?"

"చెబుతాను. మీరు అభిమానపడే వారందరూ కొత్త ఉద్యోగం కోసం ఆరాటపడిపోతున్నారు."

ఆయన తలూపారు. "మన మీద బొత్తిగా గౌరవంలేదు."

"శ్రీధర్ మాత్రం అప్లయ్ చెయ్యలేదు."

"ఐ.సీ.... ఇంతకీ నీకెలా వచ్చాయి యివి?"

"ఆ ప్రకటన నేనే వేశాను."

"ఎందుకమ్మా?"

"మీ అభిమాను లెవరో తెల్సుకుందామని."

పాణిచంద్ర విశ్రాంతిగా వ్రాలి సిగరెట్ వెలిగించారు. "మంచి పని చేశావమ్మా! ఇదీ ఒక పద్ధతే."

తండ్రి మెచ్చుకోవడంతో ఆనందం కలిగింది.

"మన ప్రక్కన నిలబడేవాడు శ్రీధర్ ఒక్కడేనని ఋజువైంది కదూ?"

తలూపింది పద్మ.

"ఇట్స్ ఆల్‌రైట్!" పాణిచంద్ర అక్కడ్నుంచి కదిలిపోయారు.

సగం రాత్రి ఆయనకి మెలకువ వచ్చింది. నిద్రపట్టలేదు. ఆలోచనలు ముసురుకున్నాయి.

అంతమందిని ఆకర్షించిన ప్రకటన శ్రీధర్‌ని ఎందుకు ఆకర్షించలేదు? అతడు నిజంగా నమ్మతగ్గవాడా- నాటకమాడుతున్నాడా? ఇందులో రాజకీయ ముందా?...ఆలోచించేకొద్దీ వుందని పిస్తోంది.... 'సరే అదీ చూద్దాం' పాణిచంద్ర ఒక నిర్ణయానికి వచ్చాడు.

* * *

"సారీ...మిస్టర్ శ్రీధర్! మీరు చెప్పిదేం నమ్మను. మీరు బాధ్యతాయుతంగా పనిచేస్తారని ఆశించాను. మీరు నిర్లక్ష్యంగా చేసిన తప్పు వల్ల ఫ్యాక్టరీకి నలభై వేలు నష్టం వస్తోంది. ఆ షైప్ మిషనరీ మన కక్కర్లేదు. మీరు అదే ఆర్డర్ చేశారు. గుడ్డిగా చేస్తే ఎలా? తిరిగి పంపినా వాళ్ళు తీసుకుంటారా? ఈ పరిస్థితిలో మీరు ఫ్యాక్టరీలో పని చేయడం మంచిదికాదు. మిమ్మల్ని డిస్‌మిస్ చేస్తున్నాను." పాణిచంద్ర సీరియస్‌గా అన్నాడు.

శ్రీధర్ క్షమించమన్నాడు. బ్రతిమాలేడు. అయినా పాణిచంద్ర వినలేదు.

క్యాంటీన్‌లో శ్రీధర్ విషాదంగా కూర్చున్నాడు. అప్పుడే ఈ వార్త ఫ్యాక్టరీ అంతా వ్యాపించి పోయింది. వస్తున్నారు, పరామర్శిస్తున్నారు. ఒంటిగంట ప్రాంతంలో యూనియన్ నాయకుడూ, సెక్రటరీ వచ్చారు.

"తప్పు జరిగింది. అందుకని ఉద్యోగం తీసేస్తాడా? అంతా ఈయన యిష్టమా? ఒకప్పుడు తెచ్చిన మిషను-బిగించిన వెంటనే బద్దలయి పోతుంది. అప్పుడేం చేస్తున్నాడు? శ్రీధర్...నోరు మూసుకుని కూర్చుంటే లాభం లేదు. కాగితం మీద సంతకం పడెయ్యి. మేం చూసుకుంటాం. రెండ్రోజులు సమ్మె నడిపించామా....పాణిచంద్ర మన పాదాల దగ్గిరకి రావలసిందే..." నాయకులు ప్రలోభ పెట్టారు.

"ఆయన వుద్యోగం నుంచి తీసెయ్యలేదు. నేనే రాజీనామా యిచ్చాను" అన్నాడు అబద్ధంగా.

సమ్మె నడిపిస్తే పద్మ ఏమను

కుంటుందో? అలాగని బ్రతుకు తెరువూ ముఖ్యమే! అయినా తెగించి అబద్ధం చెప్పాడు.

"నీ యిష్టం..." నాయకులు నిరుత్సాహ పడిపోయారు. వాళ్ళకి ప్రశాంతంగా వుండటం యిష్టముండదు. ఏదో గలాభా వుండాలి-లాభం కోసం.

శ్రీధర్ రూంకి వెళ్ళలేదు. ఇది తెలిసి పద్మ వస్తుందని భయం. ఆమెకి సంజాయిషీ యిచ్చుకోవడం చచ్చే బాధగా వుంది.


## శ్రీ బాలాజీ వైద్యశాల

సెక్స్ స్పెషలిస్టు డా॥ పి. కుమారస్వామి దేవర

మార్వాడీ గుడివద్ద. ఫోన్: 551, తెనాలి (ఏ.పి.)

బ్రాంచి: 26, నార్త్ బోగ్ రోడ్, మద్రాస్-17

### దీర్ఘవ్యాధులకు వుత్తమ సిద్ధ వైద్యము



హస్త ప్రయోగంవల్ల, అతి సంభోగము వలన అంగము చిన్నదై అకస్మాత్తుగా అంగము కృశించుట, శుక్ల నష్టము, నపుంసకత్వము, (ఒక్క డోస్‌తో ఎన్నడూ, కని విని ఎరుగనంత వీర్య స్తంభన కలిగి హాయి నిచ్చును. అసంతృప్తిచెందు స్త్రీ, పురుషులు వాడదగినది-స్వస్థులు.) హెర్నియా (గిలక) కుష్టు, బొల్లి, చర్మవ్యాధులకు పోస్టు ద్వారా వైద్యం చేయబడును. వరిబీజము (బుడ్డ), మూత్రవ్యాధులు ఆపరేషన్ లేకుండా నయం చేయబడును. స్వయంగా రండి.

క్షయ, ఉబ్బస వ్యాధులకు వుచిత వైద్యం - రండి.

బ్రాంచీలు:- తిరుపతి, నెల్లూరు, గుంటూర్లలో త్వరలో తెరువబడును.

వరదావారి గదిలో అజ్ఞాత వాసం చెయ్యసాగేడు.

ఒకనాటి రాత్రి తొమ్మిది గంట లకి భోజనంచేసి గదికి చిరువానలో వస్తుండగా...

పద్మ చూసి కారాపింది. చప్పట్లు కొట్టి పిలిచింది. శ్రీధర్‌కి తప్పలేదు. "మీరా?" నసుగుతూ వచ్చాడు.

"ఏమిటి- మరీ నల్లపూసయి పోయారు? వూళ్ళో లేరా?" నాలుగు రోజుల్నుంచి అతడ్ని కల్సుకో వాలని ప్రయత్నిస్తోంది. శ్రీధర్ దొరకలేదు.

"ఉన్నాను...కొంచెం పని మీద తిరుగుతున్నాను."

వాన ఎక్కువయింది.

శ్రీధర్‌ని యింటి దగ్గర దింపి "రేపుదయం వస్తారా?" అనడి గింది. వాన ఎక్కువ కాకుండా యింటికి పోవాలన్న ఆదుర్దాతో.

"అలాగే."

పద్మ భోంచేస్తూండగా పాణి చంద్రవచ్చి ఖాళీకుర్చీలో కూర్చుని- "శ్రీధర్ కనిపిస్తున్నాడామ్మాయ్?"

"ఇప్పుడే కనిపించాడు."

"ఏమన్నాడు?ఉద్యోగం పోయిం దని చెప్పాడా?"

"ఏమన లేదు. జాబ్ పోవడ మేమిటి?" ఆశ్చర్యంగా అడిగింది.

"నువ్వో ఎత్తు వేస్తే నేనో ఎత్తు వేశాను. పద్మా! నీ సెలక్షన్ మంచిదే. చెయ్యని తప్పుచూపించి వుద్యోగం నుంచి తొలగించాను. యూనియన్‌తో చేతులు కలిపి సమ్మెలోకి దిగుతాడనుకున్నాను. శ్రీధర్ అలా చెయ్యలేదు. అందుకే అతడ్ని మానేజర్ని చేస్తున్నాను."

"థ్యాంక్యూ డాడీ!"

మర్నాడు శ్రీధర్ మానేజర్‌గా జాయినయ్యాడు. పాణిచంద్ర అతడ్ని లంచ్‌కి తీసుకువచ్చాడు. పద్మ, శివకూడా కూర్చున్నారు.

"డాక్టర్ చక్రధరం నీకో మంచి సంబంధం తెచ్చాడమ్మా! కుర్రాడు లండన్‌లో వుంటున్నా డట." పాణిచంద్ర భోంచేస్తూ అన్నారు.

పద్మ శ్రీధర్‌లకి గ్రహణం పట్టింది.

"మీ ఫ్యాక్టరీకి పనికివచ్చిన వాడు, మీ అమ్మాయికి పనికిరాడా డాడీ?"

పాణిచంద్ర యిద్దర్నీ పరీక్షగా చూసి, "గ్రీన్ సిగ్నల్" అంటూ భోజనం కానిచ్చి నవ్వుతూ కదిలి పోయారు.

పద్మ జిలేబీ శ్రీధర్ నోట్లో పెట్టింది. శ్రీధర్ వేలు కూడా సుతారంగా కొరికేశాడు.

"అబ్బా. ." అంది పద్మ తీయని బాధతో. ●